బాలోత్సవం ముగింపు కార్యక్రమంలో ప్రసంగిస్తున్న బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కుష్బు కొఠారి

బాలోత్సవం.. అభినందనీయం..!

బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కుష్బుకొఠారి

పిల్లల్లో దాగున్న ప్రతిభతోపాటు సృజతనాత్మకతను వెలికితీయడానికి బాలోత్సవం ఎంతగానో ఉపయోగపడుతుందని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అని బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కుష్బు కొఠారి తెలిపారు. బాలోత్సవ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆమె పిల్లలకు సందేశమిచ్చారు. మూడు రోజులపాటు ఇంత చక్కటి వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఇటువంటి పోటీల ద్వారా విద్యార్థుల్లో దాగున్న ప్రతిభతోపాటు, సృజనాత్మకతను వెలియతీయడానికి దోహదం చేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమం అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ అధ్యక్షులు షమీమ్ షఫీవుల్లా, కార్యదర్శి సావిత్రి, కోశాధికారి జిలాన్, సభ్యులు శ్రీనివాసరావు, రిటైర్డు డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, రిటైర్డు తహశీల్దారు జయరామప్ప, మానవతా రక్తదాతల సంస్థ ప్రతినిధి తరిమెల అమర్‌నాథరెడ్డి, అపెక్స్ అధినేత తిరుపాల్, కేర్ అండ్ క్యూర్ వైద్యులు అభిలాష్, యుటిఎఫ్ నాయకులు నాగేంద్ర, కోటేశ్వరరావు, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

చెప్పలేనంత సంతోషం.. మాటల్లో వర్ణించలేనంత ఆనందం... చూసిన ప్రతి ఒక్కరూ మెచ్చుకునేంత అద్భుతం.. మదిలో చెదిరిపోని జ్ఞాపకం... పిల్లల ఆనందాల హరివిల్లు బాలోత్సవంలో ఆవిష్కృతం..!

ఆట పాటలతో మెప్పించారు.. వైజ్ఞానిక ప్రదర్శనలతో ఆలోజింపజేశారు... అందరినీ ఆకట్టుకునేలా ప్రతిభను బయటకు తీశారు.. తమకు అవకాశం ఇస్తే ఏమైనా చేయగలం అని 'బాల'చిచ్చరపిడుగులు నిరూపించారు..! ఉరిమే ఉత్సాహంతో మూడు రోజుల పాటు 'అనంత'పండుగను తీసుకొచ్చిన పిల్లలు ఈ ఏడాదికి సెలివిచ్చి, మళ్లీ ఏడు కలుద్దాం అంటూ బాలోత్సవానికి వీడ్కోలు పలికారు. బాలల సృజనాత్మక మేళవింపుగా సాగిన అనంత బాలోత్సవాలు బుధవారం ముగిశాయి. మూడు రోజుల పాటు అనంత కేంద్రంగా జరిగిన ఈ పిల్లల పండుగ ప్రతి మదిలోనూ చెదిరిపోని జ్ఞాపకంగా మిగిలింది.

అద్భుతం బాలోత్సవం..

మది ని(ప)ండుగ జ్ఞాపకం.!

- మూడు రోజుల పాటు అలరించిన పిల్లలు
- ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పండుగ శోభ
- ఆరు వేల మంది విద్యార్థుల భాగస్వామ్యం
- ప్రతిభ కనబరిచిన వారందరికీ బహుమతులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'అనంత బాలోత్సవ' సంబరం ముగిసింది. మూడు రోజులుగా అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానం పిల్లల ఆటపాటలతో సందడి కొనసాగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను చాటుకునేందుకు పోటీపడ్డారు. వారిని ప్రోత్సహించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆరాటపడ్డారు. నిత్యం చదువుల్లో మునిగితేలే విద్యార్థులకు ఈ మూడు రోజుల ఆటవిడుపు వారిలోనూ నూతనోత్సహన్ని నింపింది. ఈ ఉత్సహం పిల్లలోనే కాకుండా వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో సైతం కన్పించింది.

ఆఖరి రోజు మరింత ఉత్సాహంగా

బాలోత్సవం ఆఖరిరోజు మరింత ఉషారుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రెండు వేల మందికి పైగా విద్యార్థులు వివిధ రకాల ప్రదర్శనాల్లో పాల్గొన్నారు. చివరి రోజు నృత ప్రదర్శనలతోపాటు మట్టితో బొమ్మలు తయారు చేయడం, కర్రసాము, ముఖాభినయం నాటకీకరణ జానపద నృత్యం, కొలాటాల ప్రదర్శనలు జరిగాయి. ఈ ఒక్క రోజే సుమారు రెండు వేల మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తంగా మూడు రోజుల ఉత్సవాల్లో 135 పాఠశాలల నుంచి సుమారు ఆరు వేల మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొని వారి ప్రతిభను చూపారు. 64 ఇవెంట్స్‌లో పిల్లలు పాల్గొన్నారు.

వేషధారణలో ఉన్న పిల్లలతో యుటిఎఫ్, సివిటియు నాయకులు

బాలోత్సవంలో చిన్నారుల ప్రదర్శన

బాలోత్సవం వద్ద భోజనాలు చేస్తున్న పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

చేనేతలకు అండగా టిడిపి

చేనేత కార్మికురాలితో మాట్లాడుతున్న భువనేశ్వరి

సంజీవపురం గ్రామంలో ముళ్లగిరి వెంకటరాముడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న భువనేశ్వరి

- విజ్ఞతతో ఆలోచించి ఓటేయ్యండి
- చేనేత మహిళల ముఖాముఖిలో నారా భువనేశ్వరి
- ధర్మవరం, బత్తలపల్లిలో పర్యటన

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్, బత్తలపల్లి

చేనేతలకు అండగా నిలిచిన పార్టీ టిడిపి అని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి తెలిపారు. నిజం గెలవాలి పేరుతో నారా భువనేశ్వరి చేపట్టిన రాష్ట్ర వ్యాప్త యాత్రలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లాలో 2వ రోజు ఆమె పర్యటించారు. ధర్మవరం నియోజకవర్గంలోని బత్తలపల్లి, ధర్మవరం పట్టణాల్లో బుధవారం పర్యటించి, పలు కుటుంబాలతో మాట్లాడారు. బత్తలపల్లి మండలం సంజీవపురం గ్రామంలో ఏర్పాటుచేసిన మహిళల ఆత్మీయ సమావేశం, ధర్మవరం పట్టణంలో చేనేత కుటుంబాలతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంజీవపురం గ్రామంలో ముల్లగూరు వెంకటరాముడు, సాకే చెక్కీరయ్య ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తనవంతు సాయంగా ఒక్కొక్కరికి రూ.3లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ధర్మవరం మారుతీరాఘవేంద్రస్వామి కల్యాణ మండపంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్ ఆధ్వర్యంలో చేనేత మహిళలతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నారా భువనేశ్వరి మాట్లాడుతూ చేనేత పరిశ్రమ అభివద్ధికి మొదటి నుంచి తెలుగుదేశం పార్టీ కృషి చేస్తోందన్నారు. అన్ని రకాల సబ్సిడీలను నేతన్నలకు తెలుగుదేశం ప్రభుత్వంలో అందిచామని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే చేనేతలకు మరిన్ని సంక్షేమపథకాలు అందిస్తారన్నారు. రాష్ట్రానికి మంచి జరగాలంటే జరగాలంటే రానున్న ఎన్నికల కురుక్షేత్రంలో మహిళలు ఓటు అనే అయుధంతో టిడిపికి మద్దతు తెలిపి వైసిపిని ఓడించాలని పిలుపునిచ్చారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ చేనేతలు ఎదుర్కొంటున్న కష్టాలను తెలుసుకునేందుకు నారాభువనేశ్వరి ధర్మవరం విచ్చేశారన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే చేనేతలను మరింత ప్రోత్సాహం అందించేందుక నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లు కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, టిడిపి జిల్లా అధ్యక్షుడు బికె.పార్థసారధి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ, గోనుగుంట్ల విజయ్‌కుమార్, పరిటాల జ్ఞాన, బండారు శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

దామోదరం సంజీవయ్య జీవితం ఆదర్శనీయం

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కషి పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు అనేందుకు మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జీవితం నిదర్శనం అని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంజీవయ్య జయంతి వేడుకలను బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ దళిత కుటుంబంలో జన్మించి, ఉన్నత స్థాయికి సంజీవయ్య ఎదిగారన్నారు. మొట్టమొదట వద్ధాప్య పింఛన్ రూపకర్తగా ఆయన ఖ్యాతిగడించారన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కొండయ్య, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివ రంగ ప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మల జ్యోతి, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి మోహన్ రావు, పరిశ్రమల శాఖ అధికారి చాంద్ బాషా, పట్టు పరిశ్రమల శాఖ జెడి పద్మమ్మ, ఎస్సీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు గంగాధర్ పాల్గొన్నారు.

డీజిల్ దొంగలెవరో చర్చకు సిద్ధమా?

ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

మున్సిపాలిటీలో వారే డీజిల్ దొంగలించి తమపై ఆరోపణలు చేయడం తగదని, డీజిల్ వినియోగంపై మీ ఇంటి వద్దే బహిరంగ చర్చకు సిద్ధమా అని మున్సిపల్ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సవాల్ విసిరారు. ఎమ్మెల్యే బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రికార్డులను పరిశీలిస్తే డీజిల్ దొంగలెవరో తెలుస్తుందన్నారు. పది మంది అధికారులు పదేళ్ల నుంచి 32 ఏళ్లుగా మున్సిపాలిటీలోనే పాతుకుపోయి ఛైర్మన్ దొంగల ముఠాలో సభ్యులుగా కొనసాగుతున్నారని విమర్శించారు. మున్సిపల్ ఛైర్మన్ లేడనే భావనతో ప్రజలు నాకు ఫోన్లు చేసి వారి సమస్యలు తెలుపుతున్నారన్నారు. నా దగ్గర దొంగలెవరూ లేరని, పెద్ద దొంగ ఛైర్మన్ కాబట్టి దొంగలందరూ ఆయన దగ్గరే ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికలలో ఛైర్మన్ ఓటమిపాలైతే తాడిపత్రిలో నివాసం ఉండడని, నేను ఓడినా, గెలిచినా తాడిపత్రిలోనే ఉంటానన్నారు. నేను ఎమ్మెల్యే అయిన తర్వాత నియోజకవర్గంలో ఎక్కడా ఫ్యాక్షన్ గానా, గొడవలు గానీ లేవన్నారు. ఎంతోమంది గ్యారెంటీ ఇస్తే ఛైర్మన్ ఇప్పుడు బయట తిరుగుతున్నాడని, ఛైర్మన్ కుమారుడు ప్రజలకు ఏమి గ్యారెంటీ ఇస్తారని ఎద్దేవా చేశారు.

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

మడకశిరలో వినతిపత్రం అందజేస్తున్న జెఎసి నాయకులు

కదిరిలో నిరసన

హిందూపురంలో నిరసన

ప్రజాశక్తి మడకశిర

ప్రభుత్వ ఉద్యోగులు పెన్షనర్ల విషయంలో ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎస్‌టియు ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్టియు జిల్లా ఉపాధ్యక్షులు ఆదినారాయణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఐదు సంవత్సరాలు గడిచినా కూడా ఉద్యోగులు, పెన్షనర్లకు ఇవ్వాల్సిన డిఎ, పిఆర్‌సితో పాటు ఇతర బెనిఫిట్స్ ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు మడకశిర అధ్యక్షులు తిప్పేస్వామి, పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు మల్లికార్జున, ఫక్రుద్దీన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల సమస్యలపైకదిరి తాలూకా జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయ ,కార్మిక, పెన్షనర్ల నిరసన చేపట్టారు. తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగ ,ఉపాధ్యాయ, కార్మిక ,పెన్షనర్లకు పెండింగ్లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్ రెడ్డి, డి .శ్రీనివాసులు, ఆత్మారెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ :ఆంధ్ర ప్రదేశ్ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల, పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం పుట్టపర్తి తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌టియు నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో 15 లక్షల మంది ఉద్యోగ ఉపాధ్యాయ అవుట్‌సోర్సింగ్, ఉద్యోగులు కార్మికులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు కోనంకి చంద్రశేఖర, ఏపీ జెఎసి ఛైర్మన్ లింగా రామ్మోహన్, ఎన్‌ఎంయు షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం :ఉద్యోగులకు బకాయి వేతనాలు చెల్లించాలని బుధవారం పట్టణంలో జేఏసీ ఛైర్మన్ నరసింహులు అధ్యక్షతన వివిధ సంఘాల నాయకులు నల్ల బ్యాడ్జిలను ధరించి నిరసన ర్యాలీ చేపట్టారు. తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపి తహశీల్దార్ కు వినతిని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసి కార్యదర్శి, యుటిఎఫ్ నాయకులు మారుతీ శ్రీనివాస్, ప్రసాద్, శివన్న, విశ్వనాథ్, గంగాధర్, లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు వెంకటేష్, యశోద దేవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆత్మ స్థైర్యంతో ముందుకెళ్లాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మహిళలు ఆత్మస్థైర్యంతో బ్రతకాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆకాంక్ష అని శాసనసభ్యుడు దిద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో నాలుగవ విడత డాక్టర్ వైయస్సార్ ఆసరా క్రింద స్వయం సహాయక సంఘాల మహిళలకు చేయూతనందించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు మహిళల అభివృద్ధికి జగన్ చర్యలు తీసుకుంటున్నారన్నారు. అనంతరం మహిళా సంఘాల ప్రతినిధులకు మెగా చెక్కు ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్లు శ్రీలక్ష్మీ నారాయణ రెడ్డి, తిప్పన్న, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీ నరసమ్మ, మూడు మండలాల పార్టీ కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, రాష్ట్ర మహిళా కార్యదర్శి సాయి లీలా రెడ్డి, అగ్రి బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, మహిళా సమైక్య అధ్యక్షురాలు కృష్ణమ్మ, కౌన్సిలర్లు సాయి గీత, సూర్య గౌడ్, పలువురు వైసిపి నాయకులు, వెలుగు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి అభివృద్ధిపై రత్నాకర్‌తో ఎమ్మెల్యే చర్చలు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి అభివృద్ధిపై శాసనసభ్యుడు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ తో కలిసి చర్చించారు. బుధవారం రత్నాకర్ కార్యాలయంలో ఎమ్మెల్యే సమావేశమై ప్రభుత్వపరంగా చేపట్టిన చేపట్టబోయే అభివృద్ధి పనులను రత్నాకర్‌తో చర్చించారు.

ఎంటిఎస్ ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి -పెనుకొండ

ఎంటిఎస్ ఉపాధ్యాయులకు వేతనాలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయ చంద్రా రెడ్డి, సుధాకర్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీసత్య సాయి జిల్లా వ్యాప్తంగా మినిమమ్ టైమ్ స్కేల్ లో పనిచేస్తున్న 1998, 2008 ఎంటిఎస్ ఉపాధ్యాయులకు జనవరి నెల వేతనం ఇప్పటి వరకూ చెల్లించక పోవడం చాలా దారుణమన్నారు. ప్రభుత్వం ఎంటిఎస్ ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించడంలో జాప్యం చేస్తుండటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే జనవరి నెల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

భవన నిర్మాణ కార్మికుల సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16 న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మండల అధ్యక్షులు కుల్లాయప్ప, మండల కార్యదర్శి శ్రీ రాములు కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరాహార దీక్షలు చేసినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారి సమస్యలు తీర్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కేశవ, రవి, సూరి, నరసింహులు, గంగాదేవి, మని తదితరులు పాల్గొన్నారు.

రూ.59.40 కోట్లతో మున్సిపల్ బడ్జెట్‌కు ఆమోదం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘం 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబందించి బడ్జెట్‌కు చిన్నపాటి సవరణతో రూ.59.40 కోట్లతో కౌన్సిల్ సభ్యులు అమోదం తెలిపారు. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అద్యక్షతన బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు అన్ని పద్దులతో కలిపి రూ.59,40,65,514ల బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. బడ్జెట్ పై కౌన్సిలర్ ఆసీఫ్ వుల్లా మాట్లాడుతు అంచనాలు తగ్గట్లు పన్ను వసూళ్లు చేయడం లేదని, మున్సిపాల్టీలో ఆదాయం కంటే ఖర్చు ఎక్కువ ఉందని అన్నారు. మున్సిపల్ ఆదాయాన్ని పెంచడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మేన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ మెంబర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

బడ్జెట్ వివరాలు వెల్లడిస్తున్న కమిషనర్

దామోదరం సంజీవయ్య జయంతి

పెనుకొండ : బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు శివరామకృష్ణ, గౌరవ అధ్యక్షులు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, గౌరవ సలహాదారులు మునుమడుగు నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్‌లో విద్యార్థి ప్రతిభ

ఓబుళదేవర చెరువు : . జేఈఈ మెయిన్స్ 2024 సీజన్-1 ఫలితాలలో స్థానిక వశిష్ట స్కూల్ పూర్వపు విద్యార్థి లక్ష్మీ గణేష్ ప్రతిభ కనపర్చాడు. ఈ విద్యార్థి 7వ తరగతి నుండి 10 తరగతి వరకు వశిష్ట స్కూల్‌లో ఒలంపియాడ్ పోగ్రాంలో శిక్షణ పొందాడని విద్యార్థి తండ్రి జగన్ మోహన్ తెలిపారు. ఇంతటి ఘన విజయం సాధించిన తమ పాఠశాల పూర్వ విద్యార్థి స్కూల్ కరస్పాండెడ్ పిట్ట శివశంకర్ రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

బాధితుడికి పరామర్శ

బత్తలపల్లి : మండలంలోని జ్వాలాపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు, సచివాలయాల మండల కన్వీనర్ రాంభూపాల్‌రెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి బుధవారం రాంభూపాల్‌రెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొల్లపల్లి రామకృష్ణారెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, మాదిరెడ్డి జయరామిరెడ్డి, చల్లా క్రిష్ణా. తదితరులు పాల్గొన్నారు.

వసంత పంచమి వేడుకలు

పెనుకొండ : పట్టణంలోని ప్రగతి, గ్లోబల్, జెన్ పాఠశాలలలో కరస్పాండెంట్ యు. శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా వసంత పంచమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలలోని పదవ తరగతి విద్యార్థులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు సాయి శ్రీధర్, సాయిసృజన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని శాంతినికేతన్ పాఠశాలలలో కరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలలోని పదవ తరగతి విద్యార్థులు సరస్వతి పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంఒకరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూపురం : పట్టణంలోని వివేకానంద మిలీనియం పాఠశాల కరెస్పాండెంట్, చైర్మన్ బైసాని రాంప్రసాద్ ఆద్వర్యంలో బుధవారం పాఠశాలలో జరిగిన వసంత పంచమి, సరస్వతి పూజ కార్యక్రమంలో వైసిపి పార్లమెంట్ ఇన్‌ఛార్జి శాంతమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివిఉన్నత స్థానంలో నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బలరాం రెడ్డి, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, కాణిపాకం ఆలయ పాలకమండలి డైరెక్టర్ రవీంద్రుడు, సత్యసాయి జిల్లా యువజన విభాగ అధ్యక్షులు లోకేష్ వాల్మీకి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

హిందూపురం : పట్టణంలోని శ్రీకంఠపురం 8వ వార్డులో ప్రహరీ, మురుగు కాలువ నిర్మాణానికి వైసిపి ఇన్‌చార్జ్ దీపిక బుధవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మేన్ బలరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ గిరి, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, కాణిపాకం టెంపుల్ డైరెక్టర్ రవీంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

శిశుగృహం ఏర్పాటుకు భవనం పరిశీలన

పుట్టపర్తి క్రైమ్ : శిశుగృహం ఏర్పాటు కోసం బాలల సంక్షేమ శాఖ చైర్‌పర్సన్ రామలక్ష్మి పట్టణంలో పలు భవనాలను బుధవారం పరిశీలించారు. నుములపల్లిలో ఉన్న భవనాన్ని ఆమె తోపాటు ఆ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. కొత్తగా సత్యసాయి జిల్లా ఏర్పడిన తర్వాత పుట్టపర్తిలో శిశు గృహ ఏర్పాటుకు పరిశీలించి అనుమతులు మంజూరు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పర్యవేక్షణ అధికారి ఫరూక్‌బాషా, డిసిపిఒ మహేష్, పిఒలు మురళి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎఎస్ఐగా మస్తాన్

బుక్కపట్నం : బుక్కపట్నం ఎఎస్ఐగా మస్తాన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ముదిగుబ్బ పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న మస్తాన్ బుక్కపట్నం స్టేషన్‌కు బదిలీపై వచ్చారు.

పేదల వైద్యానికి ప్రాధాన్యత

కదిరి టౌన్ : పేదల వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే సిద్ధారెడ్డి తెలిపారు. కదిరి మున్సిపాలిటీ, 13 వార్డు బేరిపల్లి (నిజాంవలి కాలనీ)లో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైయస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ లు, కౌన్సిలర్ లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే

హిందూపురం : పరగి మండలం శాసన కోట గ్రామంలో జరుగుతున్న సప్తగిరి కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా బుధవారం ఇంటింటి సాధికారిక సర్వే చేపట్టారు. ఈ సర్వేలో అక్షరాస్యత, ఆరోగ్యం, పరిశుభ్రత, ఇంటింటికి మొక్కలు నాటే కార్యక్రమం ఇలాంటి అనేక కార్యక్రమాల పైన సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మంజునాథ్, కళాశాల పరిపాలనాధికారి బి గంగిరెడ్డి, ఎన్ఎస్ఎస్ పిఒలు ప్రకాష్ రెడ్డి, నాగేంద్ర రెడ్డి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

సమ్మె కాలపు వేతనాన్ని చెల్లించాలి : సిఐటియు

పెనుకొండలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

ధర్మవరంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి -పెనుకొండ

ఎలాంటి షరతులు లేకుండా 17 రోజుల సమ్మె కాలం వేతనాన్ని మున్సిపల్ కార్మికులకు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ వంశీకృష్ణభార్గవ కి సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల 16 రోజుల సమ్మె ముగిసి నేటికి 35 రోజులు గడిచిందన్నారు. సమ్మె వాయిదా సందర్భంగా ప్రభుత్వం షరతులు లేకుండా సమ్మె కాలం వేతనాన్ని చెల్లిస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. అయితే మినిట్స్ కాపీలో జీవో ఎంఎస్ నెం: 17 లో 17 రోజులు సమానంగా సెలవు దినాలలో పని చేయాలని షరతు విధించటం సమంజసం కాదన్నారు. సంక్రాంతి పండుగ సెలవులలో కూడా కార్మికులు రోజుకు 12 నుండి 13 గంటలు పని చేసి 16 రోజుల సమ్మె సందర్భంగా పోగైన చెత్తా, చెదారం తొలగించారని తెలిపారు. ఈ సేవలను గుర్తించకుండా 17 రోజులు సెలవుల్లో పని చేయాలనడం కార్మిక వ్యతిరేక చర్యగా భావించాల్సి వస్తుందన్నారు. ఎలాంటి షరతులు లేకుండా 17 రోజుల సమ్మె కాలం వేతనాన్ని చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బాబావలి, నగర పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు చిన్న వెంకటేష్, రిక్షా నర్సింహులు, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : సమ్మెకాలంలో ఇచ్చిన హామీలను ఈనెల 24వతేదీలోగా పరిష్కరించకపోతే పోరాటాలు చేస్తామని సీఐటీయూ మండల ప్రధానకార్యదర్శి అయూబ్ ఖాన్, పారిశుధ్యకార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు బాబు, ముకుంద హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు నిరసన చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ రాంకుమార్ కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించాలని 16 రోజులు సమ్మెచేశామన్నారు. అందులో భాగంగా షరతులు లేకుండా సమ్మెకాలం వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాలాజీ, పారిశుధ్యకార్మికసంఘం నాయకులు ప్రసాద్, చెన్నకేశవులు, ఓబుళప్ప, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : మున్సిపల్ వర్కర్లకు సమ్మెకాలంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీఐటీయూ నాయకులు జగన్మోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మునిసిపల్ కమిషనర్ కి వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తిరుపాలు, బాలకృష్ణ, జనార్ధన, నరసింహమూర్తి, రాజు, చెన్నకృష్ణ , కృష్ణకుమార్‌తోపాటు సిఐటియు నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, ముస్తాక్, తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మె సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మునిసిపల్ కార్మికులకు ఇస్తున్న హెల్త్ అలవెన్స్ వేతనంతో కలిపి చెల్లిస్తామని హామీ ఇచ్చిందన్నారు. సమ్మె కాలానికి ఎలాంటి షరతులు లేకుండా వేతనం ఇస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలకు జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఎంవిఐ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంవిఐ (మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్) కార్యాలయాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. బుధవారం స్థానిక మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన ఎంవిఐ కార్యాలయాన్నిఎమ్మెల్యే కేతిరెడ్డి, రవాణాశాఖ ఉన్నతాధికారులు జిల్లా రవాణాశాఖాదికారి కరుణసాగర్‌రెడ్డి, ఎంవీఐ వరప్రసాద్, శివప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధర్మవరం సబ్ డివిజన్‌లో ఎంవీఐ కార్యాలయం ఏర్పాటు కోసం ప్రజలు ఏళ్ల తరబడి వేచి చూడటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షులు నీలూరి ప్రకాష్, కోటిరెడ్డి బాలిరెడ్డిలతో పాటు 40వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్‌సభ్యులు, వార్డు ఇన్చార్జులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లస్థలాలివ్వాలి

ప్రజాశక్తి - గోరంట్ల రూరల్

భూపోరాటంలో పాల్గొన్న నాయకులు

మండలంలోని బూదిలి గ్రామం లో సర్వే నెంబర్ 726/6 నందు 4 ఎకరాల 20 సెంట్లు ప్రభుత్వ భూమిని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూపోరాట కార్యక్రమాన్ని నిర్వహించారు ,ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, రాష్ట్ర కార్యదర్శి బి కేశవ రెడ్డి, జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ హాజరయ్యారు. పుట్టపర్తి జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై యస్ జగన్ మోహన్ రెడ్డి 32 లక్షల ఇళ్ల స్థలాలు ఇచ్చి ఉంటే,ఇళ్ల స్థలాలు కోసం పేదలు మా భూపోరాట కార్యక్రమంలో ఎందుకు పాల్గొంటున్నారని పశ్నించారు.గ్రామీణ ప్రాంతాల్లో నిజమైన పేదలకు ఇళ్ల స్థలాలు దక్కలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి నిరుపేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలస్వామి, వెంకటనారాయణ, జి కిష్టన్న, కుమార్, నాగరాజు, శంకర, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివి ఉన్నతస్థాయిలో స్థిరపడాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

చదువుతోనే ఉన్నత స్థాయి సాధ్యమని విద్యార్థులు బాగా చదివి మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని నారా భువనేశ్వరి విద్యార్థులకు సూచించారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా కదిరి పర్యటనకు వచ్చిన భువనేశ్వరి మంగళవారం రాత్రి కదిరి రూరల్ మండలం ఎరుకులవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలలో బస చేశారు. బుధవారం ఉదయం నారా భువనేశ్వరి హరీష్ పాఠశాలలో కాసేపు విద్యార్థులతో ముచ్చటించారు. మొదట ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎంఎస్. కిరణ్ నారా భువనేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుండి బాగా చదువుకొని పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని అన్నారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులని, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి ఉన్నతస్థాయి ఉద్యోగాల్లో స్థిరపడినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కదిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి కందికుంట వెంకట ప్రసాద్, నాయకులు పర్వీన్ బాను, బాబ్జాన్, సురేష్ బాబు, హైదర్ వలి, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

సూపర్‌వైజర్‌పై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-సోమందపల్లి

అంగన్వాడీ కార్మికులను వేధిస్తూ పలు రకాల ఇబ్బందులకు గురిచేస్తుందంటూ మోద సూపర్వైజర్ రజితపై సిడిపిఒ అనురాధకు మోద క్లస్టర్ అంగన్వాడీలు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి శ్రీదేవి మాట్లాడుతూ సూపర్వైజర్ రజిత తన పరిధిని దాటి కార్మికులపై ఏక వచనాలతో సంబోధిస్తూ బూతు పురాణం మాట్లాడుతుందని విమర్శించారు. ఆమెకు అనుకూలంగా ఉండే వారిని చేరదీస్తూ మిగతా కార్మికుల పట్ల వివక్ష చూపుతోందన్నారు. బకాయి వేతనాలు, అంగన్వాడీ భవనాల అద్దె బిల్లుల్లో కమీషన్ ఇవ్వాలని లేనిపక్షంలో బిల్లులు పెట్టకుండా నిలిపేస్తానని బెదిరింపులకు పాల్పడుతోందని ఈమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్మికులతో కలసి సిడిపిఒ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలం డి.చెర్లోపల్లిలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు బుధవారం భూమిపూజ నిర్వహించారు.బుధవారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేయనున్న అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి ముక్కోటి అంబిక సేవాచారిటబుల్ ట్రస్ట్ అధినేత దంపెట్ల శివ భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ప్రజా సమాఖ్య అధ్యక్షులు మద్దలచెరువు మల్లి, హ్యాండ్ బాల్ సెక్రటరీ శివశంకర్, చెర్లోపల్లి పల్లి ఎస్సీ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యవైజ్ఞానిక ప్రదర్శనలో పరిగి విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - పరిగి

ఇటీవలే పుట్టపర్తిలోనే మంగళకర ఎడ్యుకేషన్ సెంటర్లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో పరిగి మండలం ధనాపురం విద్యార్థిని నిఖిల ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి ఇన్స్పైర్ కు ఎంపికైనట్లు గైడ్ టీచర్ సుకన్య తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞాను ప్రదర్శనలో విద్యార్థినికి గైడ్ టీచర్ గా సుకన్య వ్యవహించారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనపరిన విద్యార్థిని చిత్తూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో ఈ విద్యార్థిని పాల్గొంటుందని డిఇవో మీనాక్షి తెలిపారు.వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు అభినందించారు.

చేనేతలతో ముఖాముఖి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

సమావేశానికి వెళుతున్న వార్డు ప్రజలు

చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి తలపెట్టిన నిజం గెలవాలి అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం మారుతీరాఘవేంద్రస్వామి కళ్యాణ మండపంలో చేనేతలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. 25వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి భీమనేని ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో వార్డుకు చెందిన చేనేత మహిళలు అధికసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అండగా ఉంటాం...

ప్రజాశక్తి కదిరి అర్బన్

టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎలాంటి పరిస్థితుల్లోనూ అధైర్యపడొద్దని తాము అండగా ఉంటామని నారా భువనేశ్వరి అన్నారు. నిజం గెలవాలి పర్యటనలో భాగంగా ఆమె కదిరి నియోజకవర్గంలో పర్యటించారు. కదిరి మున్సిపాలిటీ, నల్లచెరువు, తనకల్లు, గాండ్లపెంట, నంబుల పూలకుంట, తలుపుల మండలాలలో పర్యటించిన ఆమె తెలుగుదేశం పార్టీనాయకులు కార్యకర్తలను పరామర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలు దౌర్జన్యాలు దూరం కావాలంటే తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరిటాల సునీత, టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంటతోపాటు పవన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ముదిగుబ్బ : చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరికి మండల కేంద్రంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు భువనేశ్వరికి స్వాగతం పలికారు. అనంతరం సంజీవపురానికి చెందిన ఇద్దరు టిడిపి కార్యకర్తలు వెంకటరాముడు, చెక్కిరయ్య కుటుంబ సభ్యులను నారా భువనేశ్వరి పరామర్శించారు

గుడిబండ : చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి గురువారం గుడిబండ మండలంలో నిర్వహించే నిజం గెలవాలి కార్యక్రమంలో పాల్గొంటుందని ఆమె పర్యటనను విజయవంతం చేయాలని టిడిపి మండల కన్వీనర్ మద్దనకుంటప్ప తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి అత్యధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పెనుకొండ: నిజం గెలవాలి కార్యక్రమంలో బాగంగా బుధవారం పట్టణంలోని దర్గాపేటకు చెందిన ఆర్‌ఆర్ రహీం కుటుంబాన్ని చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం గా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బి. కె. పార్థసారథి,పార్థసారథి సతీమణి కమలమ్మ, నియోజకవర్గం పరిశీలకులు నరసింహా రావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ, టీడీపీ నాయకులు కురుబ కృష్ణమూర్తి, నియోజకవర్గంలోని పార్టీ నాయకులు,తెలుగు మహిళలు,కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

కొత్తచెరువు : మండలం పరిధిలోని మైలేపల్లికి చెందిన 30 కుటుంబాలు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి. వైసిపి ప్రభుత్వ పాలనలో విసిగిపోయిన తాము తెలుగుదేశం పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి పల్లె వీరికి టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, కేశప్ప, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి చేరిన వారితో పల్లె రఘునాథరెడ్డి

జగనన్నతోనే మహిళా సాధికారత సాధ్యం

ప్రజాశక్తి బత్తలపల్లి

వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన పాలనలో మహిళల ఆర్థికాభివృద్ధికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద వైఎస్సార్ ఆసరా వారోత్సవాలను ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన నిర్వహించారు. పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం కింద మంజూరైన రూ.5,63,32, 415లు మెగా చెక్కును అందజేశారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ గొల్లపల్లి రామకృష్ణారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కమతం ఈశ్వరయ్య, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ జగ్గిరి జయపరెడ్డి తదితర నాయకులతో పాటు ఏరియా కోఆర్డినేటర్ రామేశ్వరరెడ్డి, ఏపీఎం సుదర్శన్ రాజు పాల్గొన్నారు.

దుకాణంలో చోరీ

ఓబుళదేవర చెరువు : మండల కేంద్రంలోని వైయస్సార్ సర్కిల్ లో కిరాణా కొట్టు పెట్టిన వ్యాపారి ఓ నరసింహులు చిల్లర దుకాణంలో చోరీ జరిగింది. దుకాణానికి అమర్చిన తలుపుల స్క్రూలను తొలగించి దుకాణం ప్రవేశించిన దుండగులు అక్కడ ఉన్న సిగరెట్లు, బీడీలు, ఇతర చిల్లర వస్తువులతో పాటు నగదను దోచుకెళ్లినట్లు బాధితుడు వాపోయారు. చోరీ వల్ల తాను రూ. 60వేల దాకా నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. చోరీ జరిగిన విషయాన్ని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కాలేజ్ సర్కిల్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పట్టణంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన శ్రీనివాసమూర్తి ద్విచక్రవాహనంలో పట్టణంలోకి వస్తుండగా కాలేజ్ సర్కిల్ వద్ద ఎదురుగా వస్తున్న ఐచర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసమూర్తి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు.అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో మరో ఇద్దరికి...

చిలమత్తూరు : మండలంలో బుధవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. 44వ నెంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్టు వద్ద కూరగాయల ఆటోను వెనుక నుండి లారీ ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న మహబూబ్ భాషా అనే డ్రైవర్‌కి గాయాలు అయ్యాయి. అదే విధంగా చిలమత్తూరు హిందూపురం ప్రధాన రహదారి విశ్వశ్రీ విద్యానికేతన్ సమీపంలో ముందు వెళుతోన్న ద్విచక్ర వాహనాన్ని మరొక ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో మహిళ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను 108లో బాగేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఐహెచ్‌పి పరిశ్రమలో కార్మికుడికి గాయాలు

చిలమత్తూరు : మండలంలోని కొడికొండ చెక్‌పోస్టు సమీపంలో ఉన్న ఐహెచ్‌పి పరిశ్రమలో పని చేస్తున్న రాజస్థాన్‌కు చెందిన "అన్నారన్" అనే కార్మికుడు గాయపడ్డాడు. మిషన్ పై నున్న కేబుల్ తగిలి ప్రమాదవశాత్తు క్రింద పడిన ఘటనలో కార్మికుడికి కాలువిరిగింది.యాజమాన్యం కార్మికుడిని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. మెరుగైన వైద్యం అందించి కార్మికుడిని, అతని కుటుంబాన్ని ఆదుకోవాలని సిఐటియు నాయకులు లక్ష్మినారాయణ డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి అస్వస్థత

ఓబుళదేవర చెరువు : మండలంలోని కమ్మవారిపల్లి యూపీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు నీల కోటప్ప బుధవారం తీవ్ర అస్వస్థకు గురయ్యాడు.. ప్రధానోపాధ్యాయులు సుధాకర్ నాయక్ తెలిపిన వివరాలు... నీల కోటప్ప మినిమం టైం స్కేల్ కింద ఉపాధ్యాయునిగాఇటీవల నియామకం పొందారు. బుధవారం విద్యార్థులకు పాఠాలు చెబుతున్న సమయంలో అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన హెడ్మాస్టర్, తోటి ఉపాధ్యాయులు నీలకోటప్పను వెంటనే దగ్గరలో ఉన్న కొండకమర్ల ఆర్ఎంపి వైద్యుల వద్దకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించి అనంతరం 108 అంబులెన్స్ లో కదిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నీలకోటప్ప బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైనట్లు గుర్తించిన వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం సిఫారసు చేశారు. నీలకోటప్ప నిరుపేద కావటంతో తోటి ఉపాధ్యాయులు అందరూ కలిసి చందాలు వేసి అతన్ని అనంతపురానికి వైద్య చికిత్స నిమిత్తం తరలించారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

బుక్కపట్నం : గ్రామాలలో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సురేష్ బాబు హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని జానకంపల్లి క్రాస్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అక్రమంగా తరలిస్తున్న 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాలలో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని, అలాంటి వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ రంగనాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయివేటు స్కూల్ ప్రిన్సిపల్ మృతి

కదిరి టౌన్ : పట్టణంలోనిఆజాద్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఫారూక్ (47) ఆకస్మికంగా మృతిచెందాడు. పిన్సిపల్ మృతి వార్త తెలుసుకున్న టీడీపీ ఇన్‌ఛార్జి కందికుంట మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు.

పరిగి ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా శివప్రసాద్ రెడ్డి

పరిగి : పరిగి ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా శివ ప్రసాద్ రెడ్డి ని నియమిస్తూ జిల్లా ఉన్నత అధికారులు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న సౌజన్య లక్ష్మి ఎన్నికల విధుల్లో భాగంగా కడప ఎర్రగుంట్లకు బదిలీ అయ్యారు. ఈమె స్థానంలో కర్నూలుకు చెందిన వసుంధరను తహశీల్దార్‌గా నియమిస్తూ ఉన్నత అధికారులు ఆదేశాలు జారీ చేశారు. 15 రోజులు గడిచినప్పటికీ తహశీల్దార్ విధులకు హాజరు కాకపోవడంతో మండల ప్రజల ఇబ్బందుల దృష్ట్యా హిందూపురం తహశీల్దార్ శివ ప్రసాద్ రెడ్డిని పరిగి ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

పేరు మార్పు అంశాన్ని ఉపసంహరించుకోండి

హిందూపురం : పట్టణంలోని ఆర్ పి జి టి రోడ్డును ఈద్గ రోడ్డుగా మార్చుతు కౌన్సిల్ అజెండాలో పెట్టిన అంశాన్ని వెనక్కి తీసుకోవాలని హిందూ సంఘాల వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం మున్సిపల్ కమిషనర్ చాంబర్ ముందు ఆందోళన చేసి, కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి సమస్యను వివరించి, వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రమేష్ రెడ్డి, ప్రకాష్ తో పాటు పెద్ద ఎత్తున హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి : పట్టణంలోని ఆర్ .పి.జి.టి రోడ్డును ఈద్గా రోడ్డుగా పేరు మార్చాలని అజెండాలో చేర్చిన అంశం తొలగించాలని డిమాండ్ చేస్తు బుధవారం హిందూ సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన చేసి ర్యాలీగ వెళ్తున్న వారిపై అల్లరి మూకలు రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో ప్రకాష్ అనే వ్యక్తి తలకు దెబ్బలు తగిలాయి. దీనిని నిరసిస్తు వన్ టౌన్ స్టేషన్ ముందు ఆందోళన చేశారు. విచారణ చేసి వెంటనే పోలీసులు అప్రమత్తమై రాళ్లు విసిరిన వారిలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

న్యాయం చేయండి

హిందూపురం : నకలీ పత్రాలను సృష్టించి, భూమిని విక్రయిస్తామని నమ్మించి...మోసం చేసిన బెల్లం నరేష్ పై చర్యలు తీసుకుని, తనకు న్యాయం చేయాలని పట్టణంలోని 19వ వార్డు విద్యానగర్‌కు చెందిన భారతి కోరారు. బుధవారం స్థానిక రెండవ పోలీస్ స్టేషన్ వద్ద భారతి మీడియాతో మాట్లాడుతు తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. పట్టణంలోని అధికార వైసిపి పార్టీలో బి బ్లాక్ కన్వీనర్ గా పని చేస్తున్న వాటర్ బెల్లం నరేష్ తనకు సంబంధం లేని భూమికి నకలీ పత్రాలను సృష్టించి తనకు విక్రయిస్తానని చెప్పి రూ.25 నుంచి 30లక్షల వరకు తీసుకున్నారని అన్నారు. ఈ డబ్బులను ఇవ్వాలని గతంలో అడిగితే చెక్కులను ఇచ్చారనిఆ చెక్కులు సైతం బౌన్స్ అయ్యాయని చెప్పారు. దీంతో గత శుక్రవారం తనతో పాటు తమ పిల్లలు అతని ఇంటికి వెళ్లగా వారు టూటౌన్ పోలీసులు తీసుకొచ్చి అదే రోజు స్టేషన్‌లో మాట్లాడి న్యాయం చేస్తామన్నారు. నరేష్ నుంచి తనకు ప్రాణ హాని ఉందని, కేసు నమోదు చేసుకుని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేస్తే, టూటౌన్ సిఐ రీయాజ్ అహ్మద్ కేసు నమోదు చేయమని చెప్పారన్నారు. నరేష్ వద్దకు డబ్బులు అడగడానికి వెళితే తనను బెదిరించి భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయంపై హిందూపురం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడానికి వెళితే ఇలాంటి కేసులను తీసుకోమని సిఐ చెప్పారని అన్నారు. మోసం చేశాడని ఆత్మహత్య చేసుకుంటే కేసు నమోదు చేస్తానని తనను హెచ్చరించాడన్నారు. దీంతో మనస్థాపానికి గురై హిందూపురం రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై నిల్చుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న తననుకొంత మంది వాహనదారులు గమనించి వెంటనే రక్షించి రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ కు తీసుకొచ్చారన్నారు. మోసం చేసిన నరేష్ అనే వ్యక్తిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని బాధితురాలు కోరారు.

ఆత్మీయ పలకరింపు

గోరంట్ల రూరల్ : మండలపరిధిలోని మల్లాపల్లి, బుగానపల్లిలో మంత్రి ఉషశ్రీ చరణ్ భర్త చరణ్ రెడ్డి స్థానిక నాయకులతో కలసి బుధవారం ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచి శివానంద, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకర్ రెడ్డి, అగ్రి అడ్వైజర్ మెంబర్ పాటూరి లక్ష్మీరెడ్డి, ఎంపీటీసీ మాబూ సాబ్, బాబావలి, గంగిరెడ్డి, అంజన్ రెడ్డి తదితర నాయకులతో కలిసి గడపగడపకు వెళ్లి వైసిపి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలోఅగ్రి అడ్వైజరి కమిటీ చైర్మన్ పోతుల రామకష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ నాగభూషణ్ రెడ్డి సర్పంచ్ సరోజా నాగే నాయక్ , సర్పంచ్ రామాంజి నేయులు, శ్రీరాములు,మార్కెట్ యార్డ్ వైస్ చేర్మెన్ నూరు మహమ్మద్, జిల్లా కోఆప్షన్మెంబర్ డాక్టర్ భాషా, మండల కో ఆప్షన్ నెంబర్ జబ్బర్, తదితరులు పాల్గొన్నారు.